## హైమాస్ట్ లైట్లు ప్రారంభం



పూజలు చేసి లైట్లు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

బోథ్, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం చింతల్‌బోరి గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లకు గ్రామస్తులు పూజలు చేసి ప్రారంభించారు. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు ఇటీవల నేరడిగొండలోని క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే నాలుగు చోట్ల హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. వెంటనే వాటిని ఏర్పాటు చేయించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## మతిస్థితిమం లేని వ్యక్తికి సాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

ఉట్నూర్, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని శాంతి నగర్‌కు చెందిన జక్కుల అడెల్లు గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుంటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 2003–24 బ్యాచ్‌కు చెందిన యువకులు, రెహమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ.10వేల నగదు అందజేశారు. ఇక్కడ కలీంపాషా, రెహమాన్, శ్రీనివాస్, ప్రతాప్, సతీశ్, రఘు, ఉపేందర్, వసీం పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

దిలావర్‌పూర్, జవనరి 9 : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. గురువారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరోగ్యకరమైన కళాశాల, ఆరోగ్యకరమైన అలవాట్లు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, కొకోన్, ధూమపానం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉన్నప్పుడే ఆరోగ్య వంతమైన జీవితం సాగుతుందని అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరామర్శ

ముథోల్, జనవరి 9: నిర్మల్ జిల్లా ముథోల్‌లోని నయాబాదిలో బుధవారం ఆటో బోల్తా పడడంతో కోలిగల్లికి చెందిన పలువురి గాయాలయ్యాయి. దీంతో భైంసా ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న వారిని గురువారం ముథోల్ మాజీ ఎంపీటీసీ భూమేశ్, నాయకులు తాటివార్ రమేశ్, ధర్మపురి శ్రీనివాస్ పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## ప్రాచీన కళలను రక్షించాలి

ఎదులాపురం, జనవరి 9 : జానపద కోలాట ఆటల వల్ల శారీరక, మానసిక దృఢత్వంతో పాటు గ్రామాల మధ్య స్నేహ బంధాలు బలపడతాయని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. ఆదిలాబాద్‌లోని గోపాలకృష్ణమంఠంలోని మంథనం ఒక సంకల్పం కళా సంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జడ కొప్పుకోలాట ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి జరిగిన కోలాట ఉత్సవానికి ఎస్పీ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కోలాటం ఆటను ప్రారంభించారు. అనంతం ఎస్పీ గౌష్ ఆలంను మంథనం ఒక సంకల్పం కళా వేదిక నిర్వాహకులు అల్లూరి సంజీవరెడ్డి, నిశికాంత్ దేశ్‌పాండేలు శాలువాతో సన్మానించారు. కోలాట ఉత్సవాలు ఈ నెల 11వ తేదీ వరకు సాగుతాయని కళా వేదిక నిర్వాహకులు నిశికాంత్ తెలిపారు.

## శారదాదేవి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎదులాపురం, జనవరి 9 : ఆదిలాబాద్‌లోని రామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో తెలంగాణ శ్రీ శారద మహిళా భక్త సమ్మేళనాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు శారదా దేవి జీవితం, ఉపదేశాలపై పోటీ పరీక్షను నిర్వహించారు. గురువారం నిర్వహించిన పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను జిల్లా అధ్యక్షుడు ఆరె భూమన్న, సమితి సభ్యులతో కలిసి పూజలు చేసి ఆవిష్కరించారు. అనంతరం ఆయా పాఠశాల, కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు ఆరె భూమన్న మాట్లాడుతూ శారదాదేవి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి కోరెడ్డి లెనిన్, సభ్యులు లంక హన్మాండ్లు, ప్రశాంత్, సాయి పాల్గొన్నారు.

## త్వరలో టెండర్లను ఆహ్వానిస్తాం

బాసర, జనవరి 9 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో త్వరలో టెండర్లను ఆహ్వానిస్తామని వీసీ గోవర్ధన్ తెలిపారు. గురువారం క్యాంపస్‌లో ట్రిపుల్‌ఐటీ అప్‌గ్రేడ్‌పై కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్ సేవలను అప్‌గ్రేడ్ చేయడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలలో ఈ ముఖ్యమైన అభివృద్ధి ఒక ప్రధాన మైలురాయి సూచిస్తుందన్నారు. క్యాంపస్ సౌకర్యాలు, సేవల కోసం టెండర్లను త్వరలో ఆహ్వానించి పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. మరో రెండు సార్లు కమిటీతో జరగబోయే సమావేశానంతరం టెండర్లను ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

## సంస్కార్ స్కూల్ విద్యార్థుల క్షేత్ర పర్యటన



జిన్నింగ్ మిల్లులో పత్తి పంటను పరిశీలిస్తున్న విద్యార్థులు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 9: నిర్మల్‌లోని సంస్కార్ స్కూల్ విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీ భారత్ కాటన్ జిన్నింగ్ మిల్లును సందర్శించారు. విద్యార్థులకు పత్తి పంట సాగు నుంచి దిగుబడి, ప్రాసెసింగ్, పత్తితో వస్త్రం తయారు అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అలాగే పసుపు తోటను సందర్శించారు. పసుపు పంట సాగును విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అయ్యన్న గారి రచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## • చెత్తశుద్ధి ఎక్కడ..?



ఎంపల్లిలో అధ్వానంగా తయారైన సెగ్రిగేషన్ షెడ్డు

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని ఎంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్డు అధ్వానంగా తయారైంది. మండల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామంలో చెత్త సేక రణ చేపట్టి సేంద్రియ ఎరువు తయారు చేసేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– నార్నూర్, జనవరి 9

## దరఖాస్తు చేసుకోండి

కుబీర్, జనవరి 9: నిర్మల్ జిల్లా కుబీర్‌లోని కేజీబీవీలో ఆంగ్లం బోధించేందుకు తాత్కాలిక పద్ధతిన అర్హులైన అభ్యర్థులు ఈనెల 11వ తేదీలోగా ఎంఏ బీఎడ్, బీఈడీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో వాణి ఒక ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు ఎస్‌వోను సంప్రదించాలని కోరారు.

# ఆరోగ్య పాఠశాలపై మండల స్థాయి పోటీలు



గుడిహత్నూర్: మండల స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు



తాంసి: మాట్లాడుతున్న ఎంఈవో శ్రీకాంత్

ఎదులాపురం,జనవరి 9 : ఆదిలాబాద్ జిల్లాలో అమలు చేస్తున్న ఆరోగ్య పాఠశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని ఎంఈవో సోమయ్య తెలిపారు. గురువారం ఆదిలాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల స్త్రీ శక్తి భవనంలో ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల మండలాల విద్యార్థులకు మండల స్థాయి ఆరోగ్య పాఠశాల కార్యక్రమంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మూడు మండలాల్లోని 23 పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. మండల స్థాయి ఆరోగ్య పాఠశాల పోటీల్లో ప్రతి మండలం నుంచి ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థుల చొప్పున జిల్లా స్థాయికి ఎంపిక చేశామని తెలిపారు. వీరు ఈ నెల 20న జరిగే జిల్లా స్థాయిలో పాల్గొంటారని ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారికి ఈ నెల 26న నగదుతో పాటు ప్రశంసాపత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్, మావల ఎంఈవోలు కంటె నర్సయ్య, సరోజ, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

గుడిహత్నూర్, జనవరి 9: ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా గుడిహత్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఆర్ ఉదయ్‌రావ్ అధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో గుడిహత్నూర్ మోడల్ స్కూల్ విద్యార్థి ఆర్ తిలక్, రెండవ స్థానంలో మన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దీపిక, మూడో స్థానంలో సీతాగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రుచిత నిలిచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవీదాసు, పోటీ నిర్వాహకులు ఆర్ విఠల్, వెంకట్, వినేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాంసి, జనవరి 9: తాంసిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆరోగ్య పాఠశాల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తాంసి పాఠశాల విద్యార్థిని అనన్య, గోట్కురి పాఠశాల విద్యార్థి శరంతి, కప్పర్ల పాఠశాల విద్యార్థి శరణ్య ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ రిమాండ్‌కు తరలింపు



మాట్లాడుతున్న బోథ్ సీఐ వెంకటేశ్వర రావ్

ఇచ్చోడ(బజార్‌హత్నూర్), జనవరి 9: అతిగా మద్యం తాగి ఆటో నడిపి ముగ్గురికి మృతి కారణమైన ఆటో డ్రైవర్ పాలెపు రాకేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర రావ్ తెలిపారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన బజార్‌హత్నూర్ మండలంలో ఆటో డ్రైవర్ పాలెపు రాకేశ్ అతిగా మద్యం తాగి తన ఆటోలో పరిమితికి మంచి 11 మంది ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఆటోను అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో దేగామ గ్రామ శివారులో ఆటో బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న అన్నెల అడెల్లి అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరు మైలారపు అరుణ్, ఐల ఆశన్న రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరికొంత మందికి గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ అప్పారావ్, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కన్గుట్ట గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ మాతృమూర్తి, అలాగే గ్రామాధ్యక్షుడు లక్ష్మణ్ నాయనమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బొడ్డు శ్రీనివాస్, అల్లకొండ ప్రశాంత్, కుమ్మరి రమణ, శ్రీకాంత్, గంగమల్లు, రమేశ్ ఉన్నారు.



పరామర్శిస్తున్న బోథ్ మాజీ ఎంపీపీ శ్రీనివాస్

## పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి

ఎదులాపురం, జనవరి 9 : ప్రతి ఒక్కరూ పొగాకు రహిత యువ సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుంచి దూరంగా ఉండాలంటే పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని మానేయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘు, అధ్యాపకులు చవాన్ అనిత, సోషల్ వర్కర్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎదులాపురం,జనవరి 9 : రాష్ట్రస్థాయిలో జరిగిన యువజనోత్సవాలో భాగంగా ఆదిలాబాద్‌లోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫోక్ గ్రూప్ డాన్స్‌లో ద్వితీయస్థానం సాధించారు. గురువారం కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ అతీక్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, సూపరింటెండెంట్ కరుణాకర్, కొరియోగ్రాఫర్ దత్తు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది గోపాల్, స్వప్న, అనిత, సంతోషిణి, భువన పాల్గొన్నారు.

## ఘనంగా ఫాతిమా షేక్ జయంతి



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్ రూరల్, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లక్కారం గ్రామంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో గురువారం తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాల ఫాతిమా షేక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయురాలిని గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కలీం పాషా, గ్రామస్తులు శ్రీనివాస్, సత్యం, షబ్బీర్ ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో కూరగాయల సాగు



కూరగాయల మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బోథ్, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కిచెన్ గార్డెన్‌లో భాగంగా గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు కూరగాయల మొక్కలు నాటారు. ఆర్గానిక్ విధానంలో వివిధ రకాల కూరగాయలను సాగు చేయనున్నారు. ప్రిన్సిపాల్ సంగీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల మొక్కలు నాటారు. పండించిన కూరగాయలు విద్యార్థులకు అందించే భోజనంలో వాడతామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



ఆత్రం మారుతి(ఫైల్)

ఇంద్రవెల్లి, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంట గ్రామ సమిపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయలైన డ్రైవర్ ఆత్రం మారుతి(25) ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్నూర్ గ్రామానికి చెందిన ఆత్రం మారుతి గ్రామంలోని జైస్వాల్ నితిన్ వద్ద ట్రాలీ మ్యాక్స్ వాహనంపై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ధర్మసాగర్ గ్రామానికి చెందిన ఓ రైతు పత్తిని వాహనంలో లోడ్ చేసిన ఆత్రం మారుతి సాయంత్రం మండలంలోని ఐఎఫ్‌పీసీఎల్ జిన్నింగ్ మిల్లులో ఖాళీ చేశాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఏమాయికుంట వద్ద కుక్క ఎదురుగా రావడంతో కుక్కను తప్పించపోయి రోడ్డు పక్కనే ఉన్న రేకుల కిరాణ దుకాణాన్ని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆత్రం మారుతిని 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృత్యుడి అక్క నైతం యమునబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రిమ్స్ డైరెక్టర్‌కు సన్మానం

ఎదులాపురం, జనవరి 9: నూతన సంవత్సరం పురస్కరించుకుని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్‌ను రిమ్స్ ఐఎన్‌టీయూసీ విభాగం ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ ఐఎన్‌టీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మునిగేలా నర్సింగ్, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల రవీందర్, సంతోష్, వినోద్, రిమ్స్ విభాగం అధ్యక్షుడు గోపు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నర్సాపూర్(జీ): విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

నర్సాపూర్(జీ), జనవరి 9: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్మల్ డీఈవో రామారావు అన్నారు. నర్సాపూర్(జీ)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పరీక్ష సమయం ఎక్కువ లేదని ఇప్పటి నుంచే అన్ని సబ్జెక్టులపై అధ్యాయనం చేయాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆయన వెంట సెక్టోరల్ అధికారులు రాజేశ్వర్, లింబాద్రి, ప్రధానోపాధ్యాయుడు కిషన్ రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముథోల్, జనవరి 9 : ముథోల్‌లోని ఉన్నత పాఠశాలను డీఈవో రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించే విధంగా స్టడీప్లాన్ చేయించాలని సూచించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.



నూనతంగా ఎన్నికైన ఆర్ఎంపీ, పీఎంపీ కమిటీ సభ్యులు

## ఆర్ఎంపీ, పీఎంపీ కమిటీ ఎన్నిక

దస్తురాబాద్,జనవరి 9 : నిర్మల్ జిల్లా దస్తురాబాద మండల ఆర్ఎంపీ, పీఎంపీల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఉల్వకాని శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా తుడుం కిరణ్, ప్రధాన కార్యదర్శిగా తుడుం శంకర్, కోశాధికారిగా గారే రాజేందర్, సలహాసభ్యులుగా రాము, రాములు, ఆకుల గంగాధర్, ఇర్నాల రమేశ్, రాగి చారి, పవార్ వినోద్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

# పార్డి(బీ) జీపీలోనే కొనసాగించాలి



డీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్, జనవరి 9 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పార్డి(బీ) గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన పరుపుల పల్లెను ఇదే జీపీలో కొనసాగించాలని గురువారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీలతకు గిరిజనులు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాన్ని టీవీటీ పల్లెతో కలిసి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయడాన్ని తాము సమ్మతించమన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ జుగ్నాక్ మారుతి, ఆత్రం ధర్మన్న, పెందూర్ సుంగన్న, గంగన్న, ఆత్రం నాగోరావ్, ఆత్రం రవి, ఆత్రం జగదీశ్, కొడప గంగారాం, బాదిరావ్ ఉన్నారు.

# ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల తనిఖీ

ఎదులాపురం, జనవరి 9: ఆదిలాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను డీఐఈవో రవీంద్ర కుమార్ గురువారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, ప్రాక్టికల్ రికార్డులను పరిశీలించారు. రానున్న వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు పట్టుదలతో చదవాలని పేర్కొన్నారు. ఆయన వెంట సూపరిటెండెంట్ షేక్ మోసిన్, ప్రిన్సిపాల్ సూర్య ప్రకాశ్, అధ్యాపకులు ఉన్నారు.

## హీరాసుక్క జయంతిని ఘనంగా నిర్వహించాలి

ఎదులాపురం, జనవరి 9 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఫిబ్రవరి నెలలో నిర్వహించే హీరాసుక్క జయంతిని సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించాలని రాష్ట్రీయ జనజాతి పర్ధాన్ ఉందన్ సంఘటన్ అధ్యక్షుడు మెస్రం శంకర్ కోరారు. గురువారం ఆదిలాబాద్‌లో హీరాసుక్క జయంతి ఉత్సవాలపై ఉమ్మడి జిల్లా సంఘటన్ అధ్యక్షులతో పాటు సమాజ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామగ్రామాన ఉత్సవాలు ఏ విధంగా నిర్వహించాలో చర్చించి ప్రణాళిక చేశారు. కార్యక్రమంలో వెట్టి దేవీదాస్, మడావి దిగంబర్, కినక సతీశ్, సత్యనారాయణ, ఆత్రం అనసూయ, భాస్కర్, పూసం ఆనంద్‌రావ్, కేశవ్, సిడాం రవి పాల్గొన్నారు.

## 12 నుంచి కేజీబీవీలకు సెలవులు

నిర్మల్ అర్బన్, జనవరి 9 : పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లాలోని కేజీబీవీలకు ఈ నెల 11న పని దినంగా నిర్ణయించబడిందని కేజీబీవీ విద్యార్థులకు 12 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రభుత్వం ప్రకటించినట్లు డీఈవో రామారావు తెలిపారు. కేజీబీవీ ప్రత్యేకాధికారులు ఈ విషయాన్ని గమనించి 11న విద్యాలయాలు నిర్వహించాలని, పాఠశాలలను తిరిగి 18న పునఃప్రారంభించాలని పేర్కొన్నారు.

## రక్తనమూనా పరీక్షలు

లక్ష్మణచాంద, జనవరి 9: నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో గురువారం వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్తనమూనా పరీక్షలు సేకరించారు. వ్యాధులను గుర్తించిన అనంతరం వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ద్వారా మందులు అందిస్తామని హెచ్ఈవో హరీశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం యాస్మిన్, ఆరోగ్య కార్తకర్త దొంతుల లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

భైంసా, జనవరి 9 : నిర్మల్ జిల్లా భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ మిల్లులో మండలంలోని ఆయా గ్రామాలలోని 37 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో మల్లేశ్, తోట విజయ్, రావుల సువర్ణ, సోలంకి భీంరావ్, సుష్మా రెడ్డి, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## బాధితులకు పరామర్శ

ముథోల్ సమీపంలో ఆటో బోల్తా పడి పది మందికి గాయాలు కావడంతో బాధితులు ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ దవాఖానకు వెళ్లి వారి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు.

## పెండింగ్ డీఏ, పీఆర్సీలను ప్రకటించాలి

దస్తురాబాద్, జనవరి 9 : ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏ, పీఆర్సీలను ప్రకటించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు కొత్త కోటేశ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఎండీఎం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో టీ గంగాధర్, టీయూటీఎఫ్ సభ్యులు వినోద్ రాజ్, శ్రీనివాస్, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నర్సరీ పనులు వేగవంతం చేయాలి

దస్తురాబాద్, జనవరి 9 : నర్సరీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌తో పాటు భూత్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలను గురువారం ఆయనపరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. వివరాలు ఇవ్వని వారు వెంటనే ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శేఖర్, అనిల్, సిబ్బంది ఉన్నారు.

## చైనా మాంజాను విక్రయిస్తే చర్యలు



దిలావర్‌పూర్: కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ సందీప్

దిలావర్‌పూర్, జనవరి 9 : పతంగుల ఎగురవేసేందుకు వినియోగించే చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దిలావర్‌పూర్ ఎస్ఐ సందీప్ హెచ్చరించారు. గురువారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌తో పాటు కాల్వ, సిర్గాపూర్ గ్రామాల్లోని కిరాణా దుకాణాలను ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పతంగులు ఎగురవేసేందుకు సాధారణ దారం మాత్రమే వినియోగించాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## చైనా మాంజాను నివారిద్దాం

సారంగాపూర్. జనవరి 9: నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లోని జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు చైనా మాంజాను నివారిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్టు అధికారులు మాట్లాడుతూ చైనా మాంజా వల్ల చాలా అనార్థలు ఉన్నాయన్నారు. చైనా మాంజాను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అటవీక్షేత్ర అధికారి నజీర్‌ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఎఫ్‌బీవోలు వెన్నెల, సుజాత పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

జైనథ్, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం జామ్ని గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం 120 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పీజీ హెచ్ఎం జిల్లెల కృష్ణకుమారి, విలాస్ గౌడ్ సౌజన్యంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో జామ్ని హెచ్ఎం శరత్ కుమార్ యాదవ్, సంతోష్, రామకృష్ణ గౌడ్, పెంటపర్తి ఊశన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బస్సు సర్వీసులు నడపాలని వినతి

తాంసి, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా తాంసికి బస్సు సర్వీసులు నడిపించాలని కోరుతూ గురువారం జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బోనగిరి సౌజన్యకు జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి కళాశాలలో చదువుకోవడానికి సుమారు 300 మంది విద్యార్థులు మండలకేంద్రానికి వస్తారని బస్సులు రావడం లేదని అన్నారు. బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ భాస్కర్, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, అధ్యాపకులు ఉన్నారు.